
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 | కనిష్ఠం 27.4



కామారెడ్డి
జిల్లా వార్తలు

శనివారం 3 మే 2025



మంజీరాను చెర బడుతున్నారు!

- ఇసుక రీచ్‌లు రద్దయినా గుట్టుగా తవ్వకాలు
- అభివృద్ధి పనులతో ఇసుక అక్రమ రవాణా
- ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లకు మంజీరాలో ఇసుకకు అనుమతులు
- బిచ్కుంద, బీర్కూర్ మంజీరాలో ఇసుక తవ్వకాలు
- ఒకే వేబిల్లుతో పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల తరలింపు
- బీర్కూర్, మద్నూర్ మీదుగా ట్రాక్టర్‌లు, భారీ టిప్పర్లలో ఇసుక రవాణా
- కలెక్టర్ ఆదేశించినా ఏర్పాట్లు చేయని చెక్ పోస్టులు
- అక్రమ రవాణాను అడ్డుకోని మైనింగ్ అధికారులు
- స్థానికంగా ఉండే కొందరు రెవెన్యూ, పోలీసుల అండ

కామారెడ్డి, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరాలో ఇసుక రీచ్‌లు మూసివేసినప్పటికీ అక్రమ ఇసుక రవాణా దందా మాత్రం ఆగడం లేదు. గత కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్టవేసినప్పటికీ ప్రస్తుతం పలు అభివృద్ధి పనుల పేరిట అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు, సీసీరోడ్ల నిర్మాణాల లాంటి అభివృద్ధి పనులకు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తుండడంతో ఇదే అదనుగా భావిస్తున్న అక్రమార్కులు మంజీరాను చెర పడుతున్నారు. అభివృద్ధి పనులకు ఇసుకను తరలిస్తున్నామంటూ రెవెన్యూ, మైనింగ్ అధికారుల వద్ద వేబిల్లు తీసుకుంటున్నప్పటికీ ఒకే వేబిల్లుతో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్న నేపథ్యంలో మంజీరా వద్ద చెక్ పాయింట్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించినా సంబంధిత శాఖాధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలుతోంది. ఇటీవల పోలీసులు, రెవెన్యూ అధికారులు పెద్దమొత్తంలోనే ఇసుక ట్రాక్టర్‌లు భారీ వాహనాలను పట్టుకోవడమే ఇసుక అక్రమ రవాణాకు నిదర్శనం.

అభివృద్ధి పనుల పేరిట అక్రమ రవాణా

జిల్లాలో విస్తారంగా ప్రవహించే మంజీరా నది నుంచి అభివృద్ధి పనుల పేరుతో కొందరు ఇసుక దందాకు తెర లేపారు. మంజీరా పొడవున పెద్ద ఎత్తున ఇసుక మేటలు ఉన్నాయి. ఇసుక దందాలో ఆరితేరిన పలువురు అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు పొంది అక్రమంగా తరలిస్తున్నారు. మంజీరా నది నుంచి ఇసుకను కామారెడ్డితో పాటు పొరుగు జిల్లాలైన సంగారెడ్డి, మెదక్, పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు అనుమతులు పొంది మంజీరా నుంచి ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులు ఒకచోట డంప్ చేసి రాత్రివేళల్లో ట్రాక్టర్‌లు, టిప్పర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తుండడంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలు, టిప్పర్‌లు, ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేస్తున్నారు. ఇదేక్రమంలో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు వచ్చినా అటువైపు అధికారులు చూడవద్దంటూ స్థానికంగా ఉండే కొందరు ప్రజాప్రతినిధులు హుకూం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే అడ్డుకోవాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

ఇందిరమ్మ, సీసీ రోడ్ల కోసం ఇసుకకు అనుమతులు

జిల్లా సరిహద్దు అయిన పొరుగు జిల్లాలో మంజీరాలోని ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి. అదేవిధంగా బిచ్కుంద మండల పరిధిలోని హస్గుల్, పుల్కల్, ఖద్గవ్‌తో పాటు బీర్కూర్‌లోని పలు ప్రాంతాల్లో మంజీరాలో పలు అభివృద్ధి పనులకు స్థానికంగా ఉండే తహసీల్దార్, మైనింగ్ అధికారుల నుంచి ఇసుక తవ్వకాల కోసం అనుమతులు ఇస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, సీసీరోడ్ల నిర్మాణానికి ఇసుక తవ్వకాల కోసం అనుమతులు జారీ చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు ఇందిరమ్మ ఇళ్ల, ఇతర అభివృద్ధి పనులకు ఇసుక కోసం దరఖాస్తు చేసుకుంటే వే బిల్లులు జారీ చేస్తున్నారు. అయితే ఈ వేబిల్లుల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

బిచ్కుంద, మద్నూర్ మీదుగా అక్రమంగా తరలింపు

ప్రస్తుతం జిల్లా రెవెన్యూ, మైనింగ్ అధికారులు మంజీరా నదితో పాటు పలు వాగుల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఇతర అభివృద్ధి పనుల కోసం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. ప్రధానంగా మంజీరా నదిలో పెద్ద మొత్తంలోనే ఇసుక మేటలు ఉన్నాయి. దీంతో బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి లాంటి నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు ఇతర అభివృద్ధి పనులకు ఇసుక కోసం సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వేబిల్లులు జారీ చేసి మంజీరా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తున్నారు. అయితే ఇదే అదనుగా భావిస్తున్న ఇసుక మాఫియా అభివృద్ధి పనుల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్క వేబిల్లుతో పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లను బిచ్కుంద, మద్నూర్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బిచ్కుంద మండలం మీదుగా రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్న పది ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. సదరు ఇసుకాసురులు ఒకే వేబిల్లు మీద ఇసుక ట్రాక్టర్లను తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అదేవిధంగా మద్నూర్ మండల కేంద్రం మీదుగా భారీ టిప్పర్లలో ఇసుకను తరలిస్తుండగా రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

మిగతా 8వ పేజీలో..



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కాంగ్రెస్‌కు కార్యకర్తలే ప్రాణం

- కార్యకర్తల కృషితోనే అధికారంలోకి కాంగ్రెస్
- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- కష్టపడ్డ కార్యకర్తలకు పదవులు వస్తాయి
- ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి, మే 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు కార్యకర్తలే ప్రాణమని కార్యకర్తల కృషితోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని శుభం కన్వెన్షన్‌లో కామారెడ్డి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అధ్యక్షతన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ఈరోజు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ కుల గణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మనం నాయకులుగా ఉన్నందుకు ప్రజల సమస్యలు తీర్చడానికి ఎక్కువ సమయం కేటాయించాలని, అప్పుడే ప్రజా నాయకులం అవుతామని, పదవుల కోసం పాకులాడితే కుదరదని అన్నారు. జిల్లాకు బీజేపీ, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. నేను మంత్రిగా ఉన్నప్పుడే ప్యాకేజీ 21, 22, 23 ప్రాజెక్టును తీసుకువస్తే దానిని వారి స్వార్థాల కోసం అడ్డుకున్నారని అన్నారు. రూ.300ల కోట్లతో అయిపోయే పనిని రూ.3వేల కోట్లు పెట్టి కాంట్రాక్టు ఇచ్చారని ఆరోపించారు. చిన్నచిన్న గొడవలను పక్కన పెట్టి రాబోయే స్థానిక సంస్థల కోసం ముందుకు వెళ్లాలని అన్నారు. ప్రజలకు సేవ చేసే విధంగా లక్ష్యం పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. యంత్రాంగంలో తప్పులు జరిగితే సరిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, చిన్న చిన్న గొడవలను వివాదాలుగా మార్చితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు గ్రామ, మండల, బ్లాక్ కమిటీల ఏర్పాటుకు సహకరించాలన్నారు. భూ భారతి ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో కమీషన్లు తిన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ నియోజకవర్గానికి 3500ల ఇళ్లను ఇస్తుందని, ప్రతీ నియోజకవర్గానికి ముందుందు వెయ్యి ఇళ్లు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. జై బాపు, జైభీం, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామానికి తీసుకుపోవాలన్నారు. పార్టీలో అందరూ కలిసి ఉండాలని కొత్త, పాత బేదాలు ఉండొద్దన్నారు. ఎవరైతే జెండాలు మోస్తారో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారో వారికి పదవులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, ఆగ్రో పరిశ్రమ రాష్ట్ర చైర్మన్ కాసుల బాల్‌రాజు, జిల్లా ఇన్‌చార్జి సత్యనారాయణ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల, గ్రామ, మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిర్పూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్నూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లీ మండలం సిర్పూర్ మంజీరా వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారు జామున ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వెల్లడించారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు
(ఇన్‌సెట్)లో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జూన్ 2 వరకు భూ సమస్యలను పరిష్కరించాలి

- అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలి
- నీట్ పరీక్ష నిర్వహణకు పటిష్ట చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

లింగంపేట, మే 2(ఆంధ్రజ్యోతి) :భూ భారతి చట్టం ప్రకారం రాష్ట్రంలోని పైలెట్ మండలాల్లో జూన్ 2 వరకు భూ సమస్యలు లేని మండలాలుగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. భూ భారతి చట్టం ప్రకారం పైలెట్ మండలాల్లో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను మే చివరి వరకు పరిష్కరించి జూన్ 2న పట్టాలు అందించాలని ఆయన ఆదేశించారు. మే 5 నుంచి పైలెట్ జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేసుకుని రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై దరఖా స్తులు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన నాలుగు మండ లాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 12,759 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలియజేశారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే రూం వద్ద సీసీ టీవీలు ఉండాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక లక్ష 13వేల ఇళ్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఇందిరమ్మ పైలెట్ గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన 51వేల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటి వరకు కేవలం 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయని ఇంటి నిర్మాణాలపై కలెక్టర్లు హౌజింగ్‌శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హౌజింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతీ మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను నియమిస్తుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో ప్రభాకర్, హౌసింగ్ పీడీ జైపాల్‌రెడ్డి, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్‌రెడ్డి, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, లింగంపేట తహసీల్దార్ సురేష్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

ప్రభుత్వం అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇళ్లు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ప్రభుత్వం పేదలకు అందించే శాశ్వత ఆస్తి ఇందిరమ్మ ఇళ్లని, ఇది ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం అని అర్హులైన వారినే ఎంపిక చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంత్రితో పాటు ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను చట్ట ప్రకారం పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి భూ భారతి సమస్యల పరిష్కారం చేపట్టాలన్నారు. మే 24న జరిగే నీట్ ప్రవేశ పరీక్ష నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు.

లింగంపేటలో 4,225 దరఖాస్తులు

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

జిల్లాలో భూ భారతి పైలెట్ మండలం లింగంపేటలో ఏప్రిల్ 17 నుంచి 30 వరకు 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. రెవెన్యూ సదస్సులకు ఆయా గ్రామాల్లో రెండు రోజుల ముందుగానే టామ్ టామ్ చేయించాం. రైతులకు దరఖాస్తులను పంపిణీ చేశాం. వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరిస్తాం.

చిట్యాలలో విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



20 ఏళ్ల కల సాకారమైంది

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

తాడ్వాయి, మే 2 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో రూ. 2.11 కోట్ల నిధులతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చిట్యాల గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు తాడ్వాయి నుంచి బైక్ ర్యాలీతో యూత్ సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలోని 11 నుంచి 14 గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్థులు విద్యుత్ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ కొత్త విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణంతో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిట్యాల విద్యుత్ ఉప కేంద్రం 20 ఏళ్ల నాటి కల సాకారమైందని ఎమ్మెల్యే అన్నారు. దీంతో ఆయా గ్రామాలకు ప్రజలకు నిరంతర విద్యుత్‌లో లోవోల్టేజీ సమస్య తీరుతుందని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈ విద్యుత్ ఉప కేంద్రం ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లనే సాకారం అయిందని అన్నారు. మూడు గ్రామాల ప్రజలు విద్యుత్తు ఉప కేంద్రాన్ని నిర్మించడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటి వరకు మొత్తం సీసీ రోడ్లు పూర్తి చేశామన్నారు. గ్రామానికి బస్సు ట్రిప్పులు సరిగా రావడం లేదని అధికారులతో మాట్లాడి బస్సు ట్రిప్పులు పెంచాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చిట్యాల గ్రామంలో రైతులకు ఇబ్బందికరంగా ఉందని తక్షణమే గోదామును మంజూరు చేయించే బాధ్యత ఎమ్మెల్యేదే అని అన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి బస్సుల ట్రిప్పులు పెంచడానికి అధికారులతో మాట్లాడతానని అన్నారు. తక్షణమే గోదామును కూడా నిర్మించి ఇస్తామని తెలిపారు. తాను నిరంతరం ప్రజల కోసమే పని చేస్తున్నానని అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి మరిన్ని పథకాలు తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి గైని శివాజీ, ఎస్పీ శ్రావణ్, డీఈ కళ్యాణ్, చక్రవర్తి, నాగరాజు, కిరణ్, చైతన్య, కరుణాకర్ మండల సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్యామ్‌రావు, లక్ష్మణాచారి, యూత్ అధ్యక్షుడు అఖిల్‌రావు, మేకల రాజు, మెట్టు రామచంద్రం, సుధాకర్‌రావు, మండల గ్రామ యూత్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



జొన్నల తేమ శాతం పరిశీలిస్తున్న చంద్రశేఖర్

జొన్న పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ పంట సేకరణ మేనేజర్ చంద్రశేఖర్

పెద్ద కొడప్‌గల్, మే 2 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజక వర్గంలో రైతులు రబీ సీజన్‌లో పండించిన జొన్న పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ పంట సేకరణ మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. దీంతో పాటుగానే జొన్నల తేమ శాతం పరిశీలించారు. రైతన్నలు జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 3371 క్వింటాలుకు పొందాలని సూచించారు. జొన్నలను చెన్నీ పట్టి, ఎలాంటి చెత్తా చెదారం లేకుండా తీసుకరావాలని సూచించారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో జొన్న పంటను అధికంగా పడించినందున ధాన్యం బస్తాలు ఇప్పటికే 50 వేలకు పైగా గన్నీ బస్తాలు పంపామని, రానున్న రోజుల్లో విడతల వారీగా గన్నీ బ్యాగులు అందజేసి కొరత లేకుండా చేస్తామని తెలిపారు. రైతులు కూడా ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పంటను అమ్ముకోవాలని సూచించారు. రైతులు పండించిన జొన్న పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్, మార్క్‌ఫెడ్ సిబ్బంది చందూ, సహకార సంఘం సీఈవో సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామసభ యొక్క పాత్ర, మెరుగైనా స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించడం, సమాచార హక్కు చట్టం, స్వయం సహాయక బృందాలు తదితర అంశాలతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కార్యదర్శులకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల్లో ప్రజలకు మెరుగైనా సేవలను అందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడినషనల్ కలెక్టర్ చందర్‌నాయక్, ఇన్‌చార్జి ఆర్‌టీఎం రాజేందర్, డీపీవో మురళి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

వ్యవసాయ క్షేత్రాల్లో కేబుల్ వైర్ల చోరీ



విద్యుత్ మోటర్ల నుంచి కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లిన దృశ్యం

ఆర్మూర్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి రైతుల వ్యవసాయక్షేత్రాల్లో విద్యుత్ మోటర్లకు సంబంధించిన కేబుల్ వైర్లు, స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రైతులు కల్లెం మోహన్, మంథని నితిన్, ముత్యం, చిన్నమల్ల, గాదెపల్లి గంగారెడ్డి, మనోజ్, కేశపల్లి గంగారెడ్డి, భార్ల మనిష్, సుమన్, వా కిడి సత్యం, హరీష్, పిప్పెర మోహన్, గాదెపల్లి సాయిరెడ్డిలకు చెందిన బోర్‌బావుల నుంచి కేబుల్ వైర్లు, స్టార్టర్లు ఎత్తుకెళ్లారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలూర్ గ్రామంలో తరచు కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకువెళ్తున్నారని దీనివల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోయారు. పోలీసులు కేబుల్ వైర్ల దొంగలపై దృష్టి సారించి వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాయిళ్ల చోరీ

బోధన్ రూరల్: ఆచన్‌పల్లి, నర్సాపూర్ పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లలోని కాపర్ వైర్లు దొంగలించారని విద్యుత్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ సీసీ ఫుటేజీల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్లు, కాయిల్స్ దొంగలను పట్టుకుంటామని హామీ ఇచ్చారు.

హున్సా ప్రభుత్వ పాఠశాలలో చోరీ

బోధన్‌రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని హున్స ప్రభుత్వ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ప్రహరీ దూకి లోనికి ప్రవేశించి రికార్డు రూమ్‌లో చిందర వందరంగా బీరువాను పగులగొట్టే ప్రయత్నం చేశారని గ్రామస్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేసవి సెలవుల్లో కారణంగా గుర్తు తెలియని వ్యక్తులు ఇదే అదనుగా భావించి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. గ్రామస్థులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ



నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నందిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ముస్లింలు ర్యాలీ నిర్వ హించారు. ఇటీవల జమ్ముకాశ్మీర్‌లో పెహ ల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ జామా మసీదు నుంచి కొ త్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా కదిలారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉగ్రవాదం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న పూర్తి మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కుల, మతాలు ముఖ్యం కావని, దేశం ముఖ్యమని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, మాజీ ఎంపిటీసీ డాక్టర్ అహ్మద్ ఖాన్, ముస్లిం నాయకులు ఎస్కే జావెద్, ఖదీర్, ఉషోద్దీన్, జమీల్, యూసుఫ్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ దేశ్‌పాండే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇట్టి అవ కాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది వినిత, కల్యాణి, షైమద్ పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మిట్టాపూర్, మద్దెపల్లిలలో శుక్రవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించారు. మిట్టాపూర్‌లో 175, మద్దెపల్లిలో 320తెలుపు, నలుపు జాతి పశువులకు ఈ టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో పద్మావతి, హుస్సేన్, రవి, గోపాల మిత్ర సిబ్బంది ఉన్నారు.

కోటగిరి మండల జీపీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

కోటగిరి,మే2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం సీఐటీయూ జిల్లా సహయ కార్యదర్శి నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా జాకీర్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా పోశెట్టి, శేఖర్, సహాయ కార్యదర్శులుగా రజిని, చాందిబాయి, కార్యవర్గ సభ్యులుగా లింగవ్వ, ఎల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ధర్మారంలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నవీపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారంలో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లను అధికారులు చేపట్టారు. ఈ నెల 1న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి' అనే వార్తకు అధికారులు స్పందించారు. ధర్మారంలో గత 28రోజుల కింద వరి కోతలు చేపట్టినప్పటికీ ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు సంబంధించిన ధాన్యాన్ని తూకం వేశారు. గ్రామంలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టడానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మోర్తాడ్, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగ పర్చుకొని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీపీఎం మారుతి అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య 19వ జనరల్ బాడి సమావేశం జరిగింది. సమావేశానికి డీపీఎం మారుతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఆర్థిక లావాదేవీలపై చర్చించారు. అనంతరం మండల నూతన మహిళా సమాఖ్య పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. మహిళ సమాఖ్య అధ్యక్షురాలుగా ఎర్రోజి లత, కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా వరలక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, సీసీలు తడకల శ్రీనివాస్, మహేందర్, గాజుల శ్రీనివాస్, ఇ. రాజేశ్వర్, మోహన్, స్వప్న, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష

ఆర్మూర్ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ ఆర్మూర్‌కు చెందిన అక్షయ్‌కు శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఎడపల్లి: ఎడపల్లి గ్రామంలో మార్చి 12న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో పరిమితికి మించి మద్యం తాగి బైక్ నడిపిన ఏఆర్పీ క్యాంప్‌నకు చెందిన వ్యక్తిని శుక్రవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా బోధన్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

బోధన్‌లో కార్డన్ సెర్చ్

● 110 బైక్‌లు, 10 ఆటోలు, ఒక కారు, 35 లిక్కర్ బాటిళ్ల సీజ్



కాలనీ వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో శుక్రవారం ఉదయం పోలీసులు కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టణంలోని బీటీ నగర్‌లో ఉమ్మడి తనిఖీలు చేపట్టారు. ప్రతి ఇంటికి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. అద్దె ఇంట్లో ఉండే వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. ఇళ్లలో వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించాలని పేర్కొన్నారు. అనంతరం సరైన పత్రాలు లేని 110బైక్‌లు, 10ఆటోలు, ఒక కారుతో పాటు 35 లిక్కర్ బాటిళ్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు విజయ్ బాబు, కృష్ణ, చందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



భద్రత వారోత్సవాలలో భాగంగా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శుక్రవారం బోధన్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ కో డీఈ ముక్తార్ షైమద్ మాట్లాడుతూ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వరంగల్ గారి ఆదేశాల మేరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులకు, మూగజీవాలకు విద్యుత్ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా జీరో ప్రమాదాల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించామన్నారు. అనంతరం విద్యుత్ భద్రత, పొదుపు సూచనలలో ఉన్న వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ లైన్ క్లియర్ తీసుకునేటప్పుడు ఎల్‌సీ ఆఫ్ ద్వారా సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న లైన్ వద్ద ఎర్త్ డిశ్చార్జి రాళ్ల హ్యాండ్ గ్లోవ్స్, సెఫ్టీ బెల్టు, సెఫ్టీ జాకెట్స్, హెల్మెట్‌లు, గమ్ బూట్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. విద్యుత్ చాలా ప్రమాదకరం కావున ప్రమాదాల బారిన పడకుండా సిబ్బందితో పాటు మూగజీవాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నగేష్ కుమార్, ఏఈ టౌన్-1 నాయిని కృష్ణ, ఏఈ టౌన్-2 కళ్యాణ్, వివిధ సెక్షన్ల పరిధిలోని సబ్ ఇంజనీర్లు, సీనియర్ లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మొరం తవ్వకాలపై ఫిర్యాదు

● స్పందించిన తహసీల్దార్ ● క్షేత్ర స్థాయిలో పరిశీలన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తొర్తి గ్రామ మత్స్యకారులు

ఏర్గట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్తి గ్రామంలోని ఊర చెరువులో పాలెం గ్రామానికి చెందిన బద్ధం అశోక్ అనే వ్యక్తి అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తున్నాడని తొర్తి గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు శుక్రవారం మండల తహసీల్దార్ మల్లయ్యకు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఊర చెరువు నందు పెద్ద గుంత తీసి మొరంను మట్టిని తీయడంతో, దీని వల్ల చెరవు కట్టకు భారీగా వరద వస్తే చెరువు తెగిపోయే ప్రమాదం ఉందని, చేపలు పట్టుకోకుండా మాకు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని, అట్టి గుంతను పూడ్చి వేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. దానికి తహసీల్దార్ మల్లయ్య స్పందించి క్షేత స్థాయిలో ఊరు చెరువును పరిశీలించి ఇరి గేషన్ అధికారులతో మాట్లాడారు. శనివారం ఇరిగేషన్ అధికారలు వచ్చి స్థలాన్ని పరిశీలిస్తారని మత్స్యకారులకు తెలిపారు. ఈ కార్యమంలో రెవె న్యూ అధికారులు, తొర్తి గ్రామంలోని మత్స్యకారులు పాల్గొన్నారు.

అన్నదానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌రూరల్, మే2 (ఆంధ్రజ్యోతి): భూభారతిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బంది చర్యలు చేపడుతున్నట్లు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ తహసీల్దార్ కార్యాలయంలోని భూభారతి కార్యాలయంలో రైతులకు మధ్యాహ్నం వేళ ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండడం కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఇస్కాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రైతులు మధ్యాహ్న బోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు

వేల్పూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో ఉన్న మహిళా సంఘాల బలోపేతానికి మండల మహిళా సమైక్య కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం మాణిక్యం సూచించారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ది కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండల మహిళ సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా సీహెచ్ సరోజిని, ఉపాధ్యక్షురాలు లలిత, ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మీ, కోశాధికారిగా లక్ష్మీ, సహాయ కార్యదర్శిగా మౌనికలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహిళ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మాణిక్యం పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



హేమలత(ఫైల్)

నవీపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట కాలనీకి చెందిన బైర హేమలత అనే 22 సంవత్సరాల యువతి అదృశ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 1న బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. ఆమె ఆచూకీ విషయమై బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినప్పటికీ లభించలేద న్నారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఇందిరమ్మ లబ్ధిదారులు ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

బోధన్‌రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పనులను వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దుతో పాటు పలు గ్రామాలను ఆయన సందర్శించారు. పెంటాఖుర్దులో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. బోధన్ ఎంపీవో మధుకర్‌తో కలిసి పెంటాఖుర్దు పంచాయతీ కార్యదర్శి సర్వే పని యొక్క పురోగతిని సమీక్షించడానికి కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే స్థలాన్ని సందర్శించారు. సందర్శన సమయంలో సబ్ కలెక్టర్ ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడారు. సర్వే కార్యకలాపాల స్థితిని ధ్రువీకరించారు. ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి మిగిలిన పనిని వేగవంతం చేయాలని సర్వే పని రేపటి నాటికి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. డేటా సేకరణలో కచ్చితంగా విధులు నిర్వహించాలని ఇచ్చిన టైమ్‌కు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశానికి చేరుకున్న గల్ఫ్ బాధితుడు లింగారెడ్డి



లింగారెడ్డితో మాట్లాడుతున్న చాంద్ పాష

ఏర్గట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): జీవనోపాది కోసం గల్ఫ్ బాట పట్టి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏర్గట్లకు చెందిన పాట్కూరి లింగారెడ్డి స్వదేశానికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన పాట్కూరి లింగారెడ్డి గత ఏడాది మలేషియాలో బతుకు దెరువు కోసం వెళ్లగా ఏజెంట్ల మోసానికి గురై ఇమిగ్రేషన్ కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచనా పట్టాడు. లింగారెడ్డి ఎలాగైన స్వదేశానికి రప్పించాలని వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అలాగే మలేషియాలోని ఐజీహెచ్‌సికి సమాచారం అందించడంతో అక్కడి ప్రభుత్వ అనుమతి ఇవ్వడంతో బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ లింగారెడ్డి ఇండియాకు రావడానికి ప్రయాణ ఖర్చులను అందజేశారు. స్వగ్రామానికి చేరుకున్న లింగారెడ్డిని చాంద్ పాష, నాయకులు కలిసి మాట్లాడారు. తమకు అన్ని విధాలుగా సహకరించిన ముత్యాల సునిల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



హున్సాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బోధన్ పోలీసులు అన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని హున్సా గ్రామంలో సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా చేయడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఓటీపీలు, యూపీఐ మోసాలు, ఆన్‌లైన్ చీటింగ్, ఉద్యోగాల పేరిట జరిగే మోసాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి ఓటీపీలు చెప్పకూడదన్నారు. సైబర్ మోసానికి గురైనట్లయితే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్స్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



డొంకేశ్వర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న సర్వసమాజ్ సభ్యులు



భీమ్‌గల్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులను సత్కరించిన ఎస్సై రజనీకాంత్

డొంకేశ్వర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 560కి పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థులను సర్వసమాజ్ కమిటీ సభ్యులు శుక్రవారం అభినందించి సన్మానించారు. మంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లాలో టాపర్‌గా డొంకేశ్వర్ ప్రభుత్వ పా ఠశాల విద్యార్థిని రక్షిత 586 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిం దని ఎంఈవో రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామకృష్ణ, హెచ్‌ఎం సురేష్ కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, సర్వసమాజ్ కమిటీ సభ్యులు మహిపాల్, సుమన్, నాగరాజు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాఠశాల యాజమాన్యం శుక్రవారం సన్మానించారు. పాఠశాలలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 48 విద్యార్థులు 500 మార్కులు, 19 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ బసంత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నర్సయ్య, ప్రధానోపాధ్యాయుడు రాస రవి కుమార్, ఏవో నర్సారెడ్డి, సంగీత, మాధవి, కార్తీక్, వినోద్ కుమార్, సాయి చరణ్, ఉపాధ్యాయలు హరికృష్ణ, రవికుమార్, రమాదేవి, మంజుల, భారతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సత్కారం

ముప్కాల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాలలో చదివిన 1986-87 పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్, పాఠశాల ఉత్తమ స్థానంలో నిలిచిన సాయిమైథిలి 582 మార్కులు సాధించిన, ద్వితీయ స్థా నంలో నిలిచిన ఎం.గంగమణి 574 మార్కులు సాధించగా, తృతీయ స్థానం సాధించిన అక్షయ 569, వర్షిణి, శివలేఖ 567 మార్కులు సాధించిన విద్యార్థులను శాలువ, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని సాధించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో 1986-87 పూర్వవిద్యార్థులు ఇ.రాజేశ్, శ్రావణ్‌కుమార్, నాగేందర్ హెచ్‌ఎం గంగారాం, ఉపాధ్యాయులు నరేందర్, చిన్నయ్య, రవి, రాజేందర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం ఘనంగా సన్మానించారు. ఇటీవల పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ పాఠశాలలోని ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులను మున్సిపల్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందిస్తూ పట్టు శాలువ, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీవో అంజనేయులు, రెవెన్యూ అధికారి ఉమాదేవి, టీఎంసీ ఉదయశ్రీ, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..

పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి ఫలితాలలో 500 మార్కుల పైబడి సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య పట్టు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభరాణి, దత్తు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్లకు సన్మానం

కోటగిరి: పొతంగల్ మండలంలో పదో తగరతిలో అత్యత్తుమ మార్కులతో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో జీ.రితిక 546, చాంద్‌బీ 538, భానుశ్రీ 529, అఖిల 529మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతిలో చదువులో చూపిన చొరవను ఇంటర్మీడియట్‌లో కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, మాజీ ఎంపీపీ గంధపు పవన్, మాజీ సర్పంచ్ వర్ని శంకర్, విఠల్, కాశగౌడ్, వహీద్, నాయకులు శాంతేశ్వర్ పటేల్, లింగాప్ప, శంకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రెడ్డి, రామారావు, నాగనాథ్, హన్మాండ్లు, చందర్, బ్రహ్మం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు మండల కేంద్రంలో..

పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రుద్రూరు జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం టెన్త్ టాపర్లు అమూల్య, రేష్మ మహిన్‌లను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, రైడ్స్ అధ్యక్షులు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి పార్వతి శేఖర్, కోశాధికారి మహిపాల్, బాలరాజు, శివకుమార్, గంగాధర్, ప్రవీణ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రూరులో 'పది' టాపర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఆలూర్: మండలంలో ఇటీవల విడు దలైన పదవ తరగతి ఫలితాల్లో అగ్రస్థానాల్లో నిలిచిన విద్యార్థులు సుప్రియ, దనక్, సంజన, హర్షిత, రజిని మండల టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ శుక్రవారం విద్యార్థులను సన్మానించి ప్రతీ ఒక్కరికి నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంఈవో నరేందర్, ఆర్ఐ రేణుక, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, సంజీవ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణం పెర్కిట్ మాడల్ స్కూల్ విద్యార్థిని రాస రస్మిత పదో తరగతి ఫలితాలలో 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించి ఉమ్మడి ఆర్మూర్ మండలంలో మొదటి స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ ఏవీఆర్ శ్యాం తెలిపారు. అదేవిధంగా ఎస్.శైలజ 577 మార్కులు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎంఈవో రాజగంగారాం, మున్సిపల్ కమిషనర్ రాజు శాలువ, పుష్పగుచ్ఛంతో విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాసమందర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500కు పైబడి మార్కులు సాధించగా స్థానిక ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈ పాఠశాలకు చెందిన ప్రజ్ఞశ్రీ 554, అలంక్రిత 551, రుచిత 550 మార్కులు సాధించగా ఇదే పాఠశాలకుచెందిన రోషిని తెలుగులో 100కు 100, శ్రీనితి మ్యాథ్స్‌లో వందకు వంద మార్కులు సాధించగా ఈ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.మధుపాల్, ఎగ్జామ్స్ ఇన్‌చార్జ్ రమేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని పడిగెల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను శుక్రవారం స్థానిక గ్రామ విద్యాభిమాని రవీందర్ యాదవ్ ఘనంగా సన్మానించారు. మార్చిలో జరిగిన పదో తరగతి విద్యార్థుల ఫలితాలను గత రెండురోజుల క్రితం విడుదల చేయగా ఈ పాఠశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు జి.అలోక, కిరణ్, సుశాంత్‌లను శాలువ, మెమెంటో, మోడల్‌తో సన్మానించి నగదును అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆయ న సూచిం చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్‌చందర్, ఉపాధ్యాలు జలేందర్, విద్యాభిమానులు రవీందర్‌యాదవ్, రావి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తలారి జాన్, టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం

దోస్త్ నోటిఫికేషన్ విడుదల

● టీయూ పరిధిలో సుమారు 30,500 సీట్ల భర్తీకి అవకాశం

డిచ్‌పల్లి, మే2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కళాశాలల ప్రవేశాలు 2025-26 విద్యాసంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి శుక్రవారం విడుదల చేశారు. మొత్తం మూడువిడతలలో డిగ్రీప్రవేశాలు చేపట్టనున్నారు. మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్‌లు మే 3 నుంచి 21 వరకు కొనసాగానున్నాయి. మే10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్‌లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి సీట్ల కేటాయింపు చేయనున్నారు. రెండో ఫేస్ రిజిస్ట్రేషన్లు మే 30 నుంచి జూన్ 8వరకు కొనసాగుతాయి. మే 30నుంచి జూన్ 9వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ 13న సెకండ్ ఫేస్ సీట్ల కేటాయింపు ఉంటుంది. 3వ ఫేస్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 13 నుంచి 19వరకు ఉంటుంది. జూన్ 13నుంచి 19 వరకు వెబ్‌ఆప్షన్స్ జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుందని టీయూ అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. దీంతో 3 ఫేజ్‌లలో డిగ్రీ ప్రవేశాలు చేపడుతామని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సుమారు 70 కళాశాలల కొనసాగుతున్నాయని, దీనిలో 30,500 వరకు సీట్లు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.



టీయూలోని బాలికల హాస్టల్ ఇదే..



హాస్టల్‌లోని ఒకే గదిలో మంచాలు ఇలా..

ఫోకస్

బాలికల హాస్టల్ భవన

నిర్మాణ పనులు ప్రారంభించేదెన్నడో?

● టీయూలో బాలికలకు వసతి కరువు ● ఇరుకుగా మారిన హాస్టల్ భవనం ● 300 మందికి సరిపోయే భవనంలో 500మంది విద్యార్థులకు వసతి

డిచ్‌పల్లి, మే2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణకు ముందే తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 11ఏళ్లు గడిచినా వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికీ పరిష్కారం కావడం లేదు. పలుమార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించినా సమస్య పరిష్కరం పరిష్కారానికి నోచుకోలేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత 8 సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు పొందగా 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. వర్సిటీలోని బాలికల హాస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా అందులో 1226మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు



టీయూ స్వాగత తోరణం

ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్ లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ హోదాలో తమిళిసై సౌందరరాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి రెండు ఏళ్లు గడిచినా ఇంతవరకు హాస్టల్ వసతి నిర్మాణానికి ముందడుగు పడలేదు. విద్యార్థినులకు సమస్యలు అధికమయ్యాయి. ఇప్పటికైనా జిల్లా శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యుడు వసతిగృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.

మంజూరైందని చెబుతున్నా పనులు ప్రారంభం కావడం లేదు..

తెలంగాణ యూనివర్సిటీకి కేంద్రప్రభుత్వం రూసా ద్వారా బాలికల హాస్టల్ మంజూరు అయిందని వర్సిటీ అధికారులు చెబుతున్న ఇంతవరకు పనులు ప్రారంభం కావడంలేదు. మంజూరు అయిందని పదేపదే ప్రకటనలే గానీ ఆ వైపు ముందడుగు పడటం లేదని, చాలారోజుల నుంచి అధికారులు ఇలాంటి ప్రకటనలు చేస్తూ కాలయాపన చేస్తున్నరని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్టీ, ఎస్టీ డిపార్టుమెంట్‌ల ద్వారా వర్సిటీకి రెండు బాలికల హాస్టల్ మంజూరు అయ్యాయి అందుకు సంబంధించి మంజూరు పత్రాలను ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న యాదగిరి, అప్పటి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా రవీంద్రభారతిలో అందుకున్నారు. ఆ ఫైల్ ఎటు పోయిందో ఉన్నతాధికారులకే తెలియాలి. ఈ విషయంలో వీసీ యాదగిరి స్పందించి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి హాస్టల్ నిర్మాణ పనులు చేపట్టాని విద్యార్థినులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్



సమస్యపై వివరాలు తెలుసుకుంటున్న డీఈ

కోటగిరి, మే2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్ వెల్లడించారు. పొతంగల్ మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన అనే కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. శుక్రవారం పొతంగల్ మండల కేంద్రంలోని బాజిరెడ్డి, ఒడ్డెర, ఎస్సీకాలనీల్లో పర్యటించారు. ఒడ్డెర కాలనీలో వాల్వు ఫెయిల్ కావడంతో సమస్య తలెత్తినట్లు డీఈ తెలిపారు. వాల్వు ఏర్పాటు చేయడంతో పాటు మిగిలిన కాలనీలలో తాగునీటి సమస్య పరిష్కరించినట్లు డీఈ తెలిపారు. ప్రజలు తాగునీటి నల్లాలకు మోటార్లు ఏర్పాటు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈ ధన్‌రాజ్, కార్యదర్శి చంద్రకాంత్‌లు ఉన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వర్ని, మే2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనగర్ గ్రామంలో శుక్రవారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1999-2000 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలకు చేరుకుని గురువులను సన్మానించి మెమొంటోలను బహుకరించారు. విద్యనేర్పి తమకు ఉన్నతస్థానంలో నిలిపిన ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, మహేష్ చంద్ర, చంద్ర శేఖర్, వెంకట స్వామి, వెంకట చారీలకు జ్ఞాపికను అందజేశారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలిగి తోటి వారికి సహకారంగా నిలిచిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు కొనియాడారు. పాటలతో సందడి చేశారు. సిల్వర్ జూబ్లీ జరపడం మరువలేని జ్ఞాపకమని ప్రశంసించారు.

ఘనంగా జగద్గురు శంకరాచార్య జయంతి వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



విగ్రహానికి పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

నిజామాబాద్ కల్చరల్, మే2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు శంకరాచార్య జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా సాగాయి. ఆలయాలతో పాటు బ్రాహ్మణపరిషత్ ఆధ్వర్యంలో జగద్గురు శంకరాచార్యకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో బ్రాహ్మణులు బైక్ ర్యాలీతో నినాదాలు చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్ లోని గీతాభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బ్రాహ్మణులు శ్రీకృష్ణుడికి, జగద్గురులకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధి యుగేందర్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వేదవేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి శంకరాచార్యులు అని అన్నారు. ఎన్నో స్తోత్రాలు, భాష్యాలు రాశారని భజగోవిందం, కనకదాల స్తోత్రం రచించి ప్రజల్లో భక్తి వికాసాన్ని పెంపొందించారని అన్నారు. కార్యక్రమంలో రొట్టె సురేష్, చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యనగర్‌లో జయంతి వేడుకలు

నగరంలోని ఆర్యనగర్‌లో శాక్తేయ పరిషత్ ఆధ్వర్యంలో జగద్గురు శంకరాచార్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పరిషత్ నాయకులు వేలేటి పవన్ మాట్లాడుతూ జగద్గురు శంకరాచార్యులు చిన్న వయస్సులోనే సన్యాస దీక్షను స్వీకరించి ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించారని అన్నారు. నాటి కాలంలో ఎన్నో ఆచారాలను శంకరాచార్యులు సంస్కరణలు చేసి అన్ని వర్గాల ప్రజలకు భక్తి మార్గాన్ని చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణశర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గేలకు కాసిన మామిడికాయలు

ఒకే గేలకు ఇరవై మామిడికాయలు

జక్రాన్‌పల్లి , మే 2 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండుకాదు ఏకంగా ఒకే గేలకు సుమారు ఇరవై మామిడికాయలు కాచాయి. దీంతో మామిడిచెట్టుకు కాచిన ఇరవై మామిడికాయలు చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వివరాలకు వెళ్తే జక్రాన్‌పల్లి మండలం మనోహరబాద్ గ్రామానికి చెందిన గడ్డం మహిపాల్‌రెడ్డి అనే రైతు తమ వ్యవసాయ క్షేత్రంలో మామిడిచెట్టును పెంచుతున్నాడు. ఆ మామిడిచెట్టుకు ఒకే గేలకు 20 మామిడి కాయలు కాసినట్లు ఆయన తెలిపారు. ఒక మామిడి గేలకు ఒకటి లేదా రెండు మూడు మామిడికాయలు కాస్తాయని, ఏకంగా ఇరవై కాయలు కాయడం పట్ల గ్రామస్థులు ఆ చెట్టుకు కాసిన మామిడికాయలను చూసేందుకు వస్తున్నారు.



కాస్లాబాద్ చెరువులో పనిచేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఉపాధి కూలీల ఖాతాల్లో వేతనాలు జమ

పెద్దకొడప్‌గల్, మే2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ చట్టం కింద పనిచేస్తున్న కూలీలకు సంబంధించిన వేతనాలు వారి ఖాతాల్లో జమయ్యాయి. ఈ సీజన్‌కింద ఉపాధిహామీలో పిష్‌పాండ్, ఫార్మేషన్ రహదారి నిర్మాణం, సీసీటీలు తదితర పనులు చేపట్టారు. ఈ పనులను కూలీలు ఫిబ్రవరి 25 నుంచి పనులు చేయగా అందుకు సంబంధించిన వేతనాలు కూలీల ఖాతాల్లో జమయ్యాయి. గత రెండు నెలల నుంచి పనులు చేస్తున్న కూలీలు వారి ఖాతాల్లో వేతనాలు జమకాకపోవడంతో డబ్బులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూశారు. ఇక మరికొన్ని గ్రామాల్లో అయితే కూలీలు వేతనాలు రావడం లేదని ఉపాధి పనులకు వెళ్లడం మానివేశారు. దీంతో గతవారం రోజుల కిందట ఉపాధి పనులు చేసిన కూలీలకు ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 10 వరకు వేతనాలు కూలీల ఖాతాల్లో జమయ్యాయి. దీంతో ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.9.80కోట్లు ఎస్సీ కేటగిరి వర్గానికి, రూ.83.59 కోట్లు ఎస్సీ వర్గానికి, ఇతరులకు రూ.224.77 కోట్ల మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 318.16 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం కూలీల ఖాతాల్లో జమ చేసింది.

సిబ్బందికి అందని వేతనాలు

ఉపాధిహామీలో కూలీలు ఎంతముఖ్యమో అదే స్థాయిలో పనులు చేయించే సిబ్బంది పాత్ర అంతే ముఖ్యం. పనులు చేయించడంలో క్షేత్రస్థాయి నుంచి ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవో, కార్యాలయంలో కూలీల బిల్లులు ఎన్‌రోల్ చేసే కంప్యూటర్ ఆపరేటర్లు ఉంటారు. వీరిలో టెక్నికల్ అసిస్టెంట్లు మినహా మిగిలినవారి వేతనాలు కొద్దినెలలుగా నిలిచినట్లు సమాచారం. దీంతో గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డు అసిస్టెంట్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తమ వేతనాలు కూడా జమ చేయాలని ఫీల్డు అసిస్టెంట్లు కోరుతున్నారు.

రోడ్డు నిండా ధాన్యం కుప్పలే..!

● ఒకవైపు ధాన్యం.. మరోవైపు వాహనాల పార్కింగ్
● ఆగని రోడ్డు ప్రమాదాలు ● పోలీసులు హెచ్చరించినా మారని తీరు



రోడ్డుపై ధాన్యం ఆరబోసిన దృశ్యం

భిక్కనూరు, మే2 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోసి రోడ్డును బ్లాక్ చేయడం.. మరోవైపు రోడ్డుకు పక్కనే వైన్స్ ఉండటంతో రోడ్డు వరకు మందుబాబులు వాహనాలను పార్క్ చేస్తుండటం.. ఈ ప్రదేశంలోనే డివైడర్ ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భిక్కనూరు మండలకేంద్రంలోని పాత జాతీయ రహదారిపై ఒకవైపు భిక్కనూరు పోలీసుస్టేషన్ నుంచి మొదలుకుని చర్చీ చౌరస్తా వరకు ధాన్యం కుప్పలు ఒకవైపు ఉండటంతో వాహనాల రాకపోకలన్నీ ఒకదారిగుండానే సాగిస్తున్నాయి. దింతో వాహనదారులు ఈ దారి గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. ఎన్నిసార్లు పోలీసులు హెచ్చరిస్తున్న రైతులు గానీ, మందుబాబులు గానీ మారడంలేదు. వైన్స్ ఎదుట ప్రతీరోజు కనీసం ఒక్క ప్రమాదమైన చోటు చేసుకుంటుందని, ఈ విషయమై పోలీసులు, అధికారులు పట్టించుకోవడం లేదని, ఈ వైన్స్ వద్ద మరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వరి ధాన్యం కొనుగోలు మొదటి నుంచి ముగిసేవరకు ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ సిబ్బంది, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైన్స్ వద్ద ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలు

రోడ్డును బ్లాక్ చేయడంతోనే..

భిక్కనూరు గ్రామంలోని పాత జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా చేసినప్పటి నుంచి ఇక రామాయంపేట వైపు వెళ్లేదారిని రైతులు పూర్తిగా బ్లాక్ చేసి ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో ఈ రోడ్డుగుండా వెళ్లే వాహనాలన్నీ కామారెడ్డి వైపు వెళ్లే రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడివరకు బాగానే ఉన్న చౌరస్తా వద్ద కూడలి ఉండగా అక్కడా ఎక్కడి నుంచి వాహనాలు వస్తున్నాయో అర్థం కాకపోవడం, ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు రోడ్డుపై నిలపడంతో రోడ్డుపై ట్రాఫిక్‌జాం ఏర్పడుతుండగా, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పాటుగా వైన్స్ వద్ద రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా వాహనాలను నిల్పడంతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో చాలామందికి తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్పగాయాలైన సంఘటనలు ఉన్నాయి.

పోలీసులు హెచ్చరించినా మారని తీరు..

రోడ్లపై ధాన్యం పోయ్యడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్డు ఇష్టారాజ్యంగా వాహనాలను నిలపవద్దని పోలీసులు పలుమార్లు హెచ్చరించిన వారితో మార్పు రావడంలేదు. వైన్స్ ఎదుట రోడ్డుకు ఇరువైపుల పెట్టిన చెట్ల కింద, రోడ్డుపై ఇష్టారాజ్యంగా వాహనాలను నిల్పడంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది. దీంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవేళ వాహనదారులు ఆ వాహనాలను పక్కకు తీసే ప్రయత్నం చేస్తే మందుబాబులు గొడవలకు దిగుతున్నారని, వైన్స్ ఎదుట రోడ్డు ఇరుకుగా మారి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ సమస్యకు పోలీసులు పరిష్కారం చూపాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న అధికారులు

గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరం

రామారెడ్డి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదన్నారు. రైతులందరూ ఈ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. 238 పశువులకు ఉచిత టీకాలను వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో శ్రీనివాస్ రావు, జేవీవో నారాయణ, పశు వైద్య సహాయకుడు రమేష్, దశరథ్, ఆంజనేయులు, బాలమణి, రాజకీయ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ముజాహిద్

బాన్సువాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఇన్‌చార్జీగా ఎంపీడీవోగా ప్రస్తుత సూపరింటెండెంట్ ముజాహిద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన బషీరుద్దీన్ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ముజాహిద్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానని ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తానని ఆయన తెలిపారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ అధ్యక్షుడిగా కోణాల గంగారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా తృప్తి ప్రసాద్, నసురుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా చందూరి హనుమాండ్లు, జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా సున్నం సాయిలు, పొతంగల్ మండల అధ్యక్షుడిగా కల్లూరీ హనుమాండ్లు, కౌన్సిల్ మెంబర్‌గా మక్కయ్య, వర్ని మండల అధ్యక్షుడిగా ఆవుల రమేష్, కౌన్సిల్ మెంబర్‌గా శంకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజులు తెలిపారు.

నాగిరెడ్డిపేటలో లక్షా 11 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

నాగిరెడ్డిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 24 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 1,944 మంది రైతుల నుంచి ఒక లక్షా 11 వేల 899 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. తాండూర్ సొసైటీ ఆధ్వర్యంలో 7 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 901 మంచి రైతుల నుంచి 52,912 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సొసైటీ సీఈవో మురళీ తెలిపారు. మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 426 మంది రైతుల నుంచి 23,862 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సొసైటీ సీఈవో సందీప్ తెలిపారు. అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు 617 మంది రైతుల నుంచి 35,125 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఐకేపీ ఏపీఎం జగదీష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహిస్తున్నారు.



లింగంపేటలో వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈ

విద్యుత్ సమస్యలు తలెత్తితే

సొంతంగా మరమ్మతులు చేయొద్దు

లింగంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు తలెత్తితే సొంతంగా మరమ్మతులు చేయొద్దని ఎన్‌డీపీసీఎల్ డీఈ విజయసారథి అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట సబ్ స్టేషన్‌లో విద్యుత్ వారోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1 నుంచి 7 వరకు విద్యుత్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు విద్యుత్ మోటార్ల వద్ద నాణ్యమైన సర్వీస్ వైర్లు, స్టార్టర్ డబ్బాలు బిగించుకోవాలని ఆయన సూచించారు. గృహ వినియోగదారులు సైతం ఐఎస్ఐ గల నాణ్యమైన విద్యుత్ వైర్లను ఉపయోగించాలన్నారు. విద్యుత్ సిబ్బంది సైతం లైన్‌లో పని చేయునప్పుడు సేఫ్టీ పరికరాలు ఉపయోగించాలని ఆయన తెలిపారు. విద్యుత్ సమస్యలు తెలెత్తినప్పుడు 1912టోల్ ఫ్రి నంబర్‌కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ మల్లెష్, సబ్ ఇంజనీర్ అశోక్, భాస్కర్ సిబ్బంది ఉన్నారు.



మద్నూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

పహల్గాం దాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ

మద్నూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన సభ్యులకు ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ముందుగా మద్నూర్ మండల కేంద్రంలోని మసీదు నుంచి గాంధీచౌక్ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సాయంత్రం గాంధీచౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేసి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఉగ్రవాదులకు ప్రభుత్వం తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల వల్ల దేశం అల్లకల్లోలమవుతుందని, వారి వల్ల ముస్లిం సముదాయానికి చెడ్డ పేరు వస్తుందని వక్తలు గుర్తు చేశారు. వారికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, బీజేపీ అధ్యక్షుడు తుకారం, నాయకులు కృష్ణ పటేల్, గంగాధర్, బాబు బాయి, అప్పర్, బషీర్, ఖాజామియా, రహీంఖాన్ పాల్గొన్నారు.

హన్మాజీపేట్ పెద్ద చెరువు శిఖం భూమి కబ్జా



అధికారులకు వినతి పత్రాన్ని అందిస్తున్న గ్రామస్థులు

బాన్సువాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలం హన్మాజీపేట గ్రామ పెద్ద చెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలంటూ శుక్రవారం గ్రామస్థులు బాన్సువాడ డివిజన్ సబ్ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాలను అందజేశారు. గత రెండు రోజులుగా గ్రామ పెద్ద చెరువు కట్ట శిఖం భూమిలో ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న కబ్జా పనులను గురించి అధికారులకు వివరించారు. ముఖ్యంగా పెద్ద చెరువు కట్టను జేసీబీలతో టిప్పర్లతో ముంపునకు గురి చేస్తూ సాగుకు అనుకూలంగా ఉండకుండా చెరువును ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి, అక్కడ చేపట్టే పనులను తక్షణమే పూర్తిగా ఆపించాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

మంజీరాను చెర బడుతున్నారు

(5వ పేజీ తరువాయి)

కొందరు స్థానిక అధికారుల అండ

బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ దందా అంతా స్థానికంగా ఉండే పోలీసు, రెవెన్యూ, చోటామోటా నాయకుల అండతోనే సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇసుక రీచ్‌లు కొనసాగుతున్న సమయంలో ముడుపులకు అలవాటు పడిన స్థానిక రెవెన్యూ, పోలీసు సిబ్బంది కొందరు అధికారులు ఇసుక అక్రమ రవాణాకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అభివృద్ధి పనుల కోసం ఇసుకకు అనుమతులు ఇస్తుండడంతో ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు, సిబ్బంది ఇసుక అక్రమ రవాణాకు అండగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంజీరాలో ప్రతిరోజూ అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తవ్వకాలు జరిపి రవాణా జరుపుతున్నా పోలీసు, రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముడుపులు ఇచ్చిన ఇసుక ట్రాక్టర్లను వదిలేస్తున్నారని డబ్బులు ఇవ్వని వాటిని రెవెన్యూ, పోలీసు సిబ్బంది పట్టుకుని సీజ్ చేస్తున్నట్లు స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. అడపాదడపగా రెండు, మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నామని గొప్పగా చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం మంజీరాలో ఇసుక తవ్వకాలను పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం లేదని స్థానిక గ్రామస్థుల నుంచి ఆరోపణలు ఉన్నాయి.



బిచ్కుందలో పది ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు (ఫైల్)

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా విడుదల



ఎల్లారెడ్డిలో ఇళ్ల జాబితా ప్రచురిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

ఎల్లారెడ్డి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని 12 వార్డులకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను శుక్రవారం కార్యాలయంలో నోటీసు బోర్డుపై ప్రచురించినట్లు ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా వివిధ వార్డుల యందు కమిటీలు తీర్మానించిన ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం చేశామని తెలిపారు. జాబితాలో ఉన్న లబ్ధిదారులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో రాతపూర్వకంగా తమ దృష్టికి తేవాలన్నారు. విచారణ అనంతరం తదుపరి తుది జాబితా కోసం జిల్లా అధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సిద్ధరాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సర్వే ఆధారంగా 15 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారన్నారు. మొదటి ప్రాధాన్యత కలిగిన అర్హులను గుర్తించి కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపిక చేశామన్నారు. ఈ పథకం నిరంతర ప్రక్రియ చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, అర్హులందరికి విడుతల వారీగా లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మత్తమాల గ్రామంలో 11 మంది, జంగమయ్యపల్లిలో 8 మంది లబ్ధిదారుల జాబితాను ఆయా గ్రామాల కార్యదర్శులు విడుదల చేశారు.

నిజాంసాగర్: మండలంలోని వెనగలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసు బోర్డుపై అతికించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు జాబితాలో వారి వారి పేర్లను చూసుకొని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఇల్లు లేని వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కారోబార్ భీమయ్య, యూత్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, నాయకులు విట్టల్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

ఎల్లారెడ్డి, మే 2 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బిల్లుల మంజూరుకు పంచాయతీ రాజ్ డీఈ గిరిధర్, ఏఈ పిచ్చయ్య లంచం అడుగుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో పది మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయని, సొంత డబ్బులతో నిర్మించారు. నిర్మించిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని శుక్రవారం లబ్ధిదారులు పంచాయతీరాజ్ కార్యాలయానికి వెళ్లి తమకు రావాల్సిన బిల్లులు మంజూరు చేయాలని డీఈ, ఏఈ కోరగా లంచం ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తామని సమాధానం ఇచ్చారని దీంతో లబ్ధిదారులు శుక్రవారం ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి బయట అప్పులు తెచ్చి నిర్మిస్తే బిల్లులు మంజూరు చేయాలంటే అధికారులకు కూడా లంచాలు ఇవ్వడం సాధ్యం కాదని సంబంధిత అధికారులు డీఈ, ఏఈలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సముదాయించగా ధర్నా విరమించారు. డీఈ గిరిధర్ వివరణ కోరగా మేము ఎవరికి డబ్బులు ఇవ్వాలని అడగలేదు. గత ప్రభుత్వ హయాంలో 10 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. వాటి నిర్మాణం కూడా దాదాపు పూర్తి అయింది. వాటికి సంబంధించిన మెజర్‌మెంట్స్‌ను తీసుకొని ఆన్‌లైన్ చేయాలి. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల సర్వేల్లో ఉన్నాం. త్వరలో బిల్లులు మంజూరు చేయిస్తామని తెలిపారు.

ఉపాధిహామీ కూలీలకు పనులు కల్పించాలి



చిట్యాలలో పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

బీర్కూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి పనులు కల్పించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకొని పనులు కల్పించాలని మండల స్పెషల్ ఆఫీసర్ అనిల్ కుమార్ ఉపాధి సిబ్బందికి, అధికారులకు సూచించారు. శుక్రవారం బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై ఈజీఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కూలీలు పనులకు వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఇంకుడు గుంతలు తవ్వించాలన్నారు. అదేవిధంగా ఇతరత్రా పనులు చేపట్టాలన్నారు. అనంతరం బీర్కూర్ మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. రైతు నగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్, ఏపీవో అక్బల్, ఉపాధి హామీ టెక్నికల్, అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేయాలి

తాడ్వాయి: ఉపాధి హామీ పనికి వచ్చే కూలీలు కొలతల ప్రకారం పని చేసి ప్రభుత్వం అందించే 307 రూపాయలను వేతనంగా పొందాలని మండల స్పెషల్ ఆఫీసర్ రాజారామ్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనికి వచ్చే కూలీలు ఖచ్చితమైన సమయపాలన, ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేసే అధిక వేతనం పొందాలని కోరారు. కూలీలు ఎంతమంది వస్తున్నారు అని అడగడం జరిగింది. అంతే కాకుండా పని వద్ద సౌకర్యాలు ఉంచాలని సూచించారు. అనంతరం సంతాయి పేట్ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ పనులను పరిశీలించారు. నిర్మాణాలను తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవిత, ఏపీవో కృష్ణ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వర్, పరమేశ్వరి, క్షేత్రస్థాయి సహాయకులు సాయిలు, హన్మంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



శివాయిపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

‘జనగణనలో కుల గణనను స్వాగతిస్తున్నాం’

తాడ్వాయి, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జనగణనలో కుల గణన చేస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని తాడ్వాయి మండలం కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అన్నారు. రాహుల్ గాంధీ ఒత్తిళ్లకు తలొగ్గి దేశవ్యాప్త కుల గణన చేయడం హర్షణీయమన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

రాజంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాయిపల్లి గ్రామంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాల సంఘం ఆహ్వానం మేరకు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని, భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ అని అన్నారు. భారత దేశంలో అంబేద్కర్ విగ్రహం లేని ఊరు గానీ, అంబేద్కర్ గౌరవించని కులం కానీ లేదన్నారు. అన్ని కులాలకు సమానత్వం ఉండాలని వెనుకబాటుతనం ఉన్నటువంటి వ్యక్తులు ముందుకు రావాలని, ప్రతిఒక్కరూ చదువుకుని ప్రజాస్వామ్య విలువలు తెలుసుకోవాలని అంబేద్కర్ చేసిన కృషిని ఎప్పుడు మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం పెద్దలు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో ప్రజలు నడుచుకోవాలి

మాచారెడ్డి: ప్రజలందరూ భక్తి మార్గం నడుచుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం పాల్వంచ మండలంలోని వాడి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వనదుర్గ పెద్దమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని, ఈ కార్యక్రమానికి హాజరైనా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందుగా ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దీపం అంటుకుని మహిళకు గాయాలు

బీర్కూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ శుక్రవారం తన ఇంట్లో పూజ గదిలో పూజ చేస్తుండగా దీపం అంటుకుని తీవ్ర గాయాలపాలైంది. వివరాలు ఇలా ఉన్నాయి. వీరాపూర్ గ్రామానికి చెందిన అవుసుల శ్రీనివాస్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం లేచి స్నానాలు ఆచరించి, ఇంట్లో పూజ చేసి దీపారాధన చేశాడు. అనంతరం శ్రీనివాస్ భార్య సరస్వతి పూజ గదిలోకి వెళ్లి పూజ చేస్తుండగా పూజ గదిలోని దీపం ఆమె చీరకు అంటుకుంది. ఈ ఘటనలో సరస్వతి శరీరం 50 శాతం మేర కాలిపోయింది. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సరస్వతి నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

కుంటలో జారిపడి రైతు గల్లంతు



నీరడి సాయిబాబా (ఫైల్)

బీర్కూర్, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన నీరడి సాయిబాబా (35) అనే రైతు శుక్రవారం గ్రామ శివారులోని సామర్లకుంటలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. అన్నారం గ్రామానికి చెందిన నీరడి సాయిబాబా అనే రైతుకు కొద్ది మేరా పొలం ఉంది. నాలుగు గేదెలు కూడా ఉన్నాయి. అయితే శుక్రవారం సాయంత్రం సాయిబాబా గేదెలు తీసుకుని సామర్లకుంట వద్దకు వెళ్లాడు. కుంటలో గేదెలకు నీళ్ల తాగించి, వాటిని కడుగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో పడి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న సానికులు గమనించి అతడిని రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ రక్షించలేకపోయారు. అనంతరం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈత గాళ్లను రప్పించి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయినా మృతదేహం లభ్యం కాలేదు.

వివాహితను హత్య చేసిన నిందితుడి అరెస్టు

కామారెడ్డి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): దేవునిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని నర్సన్నపల్లి గ్రామంలో వివాహితను హత్య చేసిన నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో కేసు వివరాలను ఎస్పీ వివరించారు. గ్రామానికి చెందిన వివాహిత చిదుర కవితను గత నెల 30న రాత్రి సమయంలో వ్యవసాయ పొలం వద్ద హత్య చేసిన ఆమె మెడలోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లగా కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పాత నేరస్థుడు దోమకొండ మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి బంగారు ఆభరణాలను, మొబైల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. కాగా నిందితుడిపై భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో మర్డర్ కేసు ఉందన్నారు. ఈ కేసులో బెయిల్ కోసం మృతురాలి వద్ద డబ్బులను అప్పుగా తీసుకొని వాటిని ఆమె తిరిగి ఇవ్వమన్నందుకు హత్య చేసినట్లు తెలిపారు. ఈ కేసును త్వరగా చేధించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, క్రైం టీం సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

తలమడ్లలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం


రాజంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామంలో శుక్రవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను ఉపాధ్యాయులు బాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఈటీ బాలు మాట్లాడుతూ క్రీడలు, చదువుల్లో ఒక భాగమని, క్రీడల వల్ల మానసిక ప్రశాంతత శరీర దృఢత్వం మెరుగవుతాయన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల స్పోర్ట్స్ కోటాలో భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి ఒక విధంగా ఉపయోగపడుతాయని అన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ మే 31 వరకు కొనసాగుతుందని, ఉదయం, సాయంత్రం ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌కి అల్పాహారం సావుసాని వెంకట్‌రెడ్డి, సావుసాని కృష్ణారెడ్డి, రంగ భాస్కర్, అశోక్, యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్, శివకుమార్, శ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, వడ్ల సిద్ధ రాములు, వడ్ల చందర్ అందించడం జరుగుతుందని తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కాయకల్ప బృందం

ఎల్లారెడ్డి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కాయకల్ప బృందం అంతర్గత పరిశీలన నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ నుంచి వైద్యుల బృందం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను గురించి ఆరా తీసి పరిశీలించారని అన్నారు. ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందులను క్షుణ్ణంగా పరిశీలించి ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామస్థాయిలో ప్రజాఆరోగ్య సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని కోరారు. రోగులకు మెరుగైనా సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాయకల్ప ఇంటర్నల్ ఇంచార్జి గిరీష్, వైద్య అధికారి రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి
దర్శన్ - జిమ్ ఖానా
ప్రియా 70 - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
ప్రియా 35 - సారంగాపాని జాతకం

బాన్సువాడ
మహేశ్వరి - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
వెంకటేశ్వర - సోదర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

